ISSN 0971-278X

# ప్రజాసాహితి

## సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

నవంబరు 2012
వెల : రు. 20/-

కోర మీసాల క్రూర భూస్వామ్యం
ఎన్నో సమస్యలకు కారణమై కూడా
అన్ని పరిష్కారాలు తానేనని
జబర్దస్తీ వినయాన్ని నటిస్తోంది
మధ్యయుగాల సంస్కృతే
స్త్రీలకు మేలు మేలంటోంది

ఉద్యమ దివ్వెలు చిమ్మిన
వికాస వెలుగులను
చిదిమేస్తానంటూ విర్రవీగుతోంది
ఆఖరి చావుకేకలై
అహంకరిస్తోంది

దళితులూ మహిళలూ
రైతుకూలీలు
చురకత్తులై చివాలున లేస్తే
కుల దురహంకార మీసాలు మసిమసి
పితృస్వామ్య పెత్తందారీ కొమ్ములు నుసినుసి




353

సమీక్ష : కె.వి.ఆర్. 'మహోదయం'లపైకె.కె.ఆర్.

కవితలు పాటలు : లక్షింపేట దళితపోరుకు సంఘీభావం

కథలు : శిరంశెట్టి కాంతారావు, వసుంధర

సంపాదకీయం - 1

# కోరలు పెంచుకుంటున్న భూస్వామ్య సంస్కృతి

**ఇటీవల** విజయవాడ నాస్తిక కేంద్రం ఆధ్వర్యాన జరిగిన సరస్వతీ గోరా శతజయంతి సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సందేశాలిచ్చిన వారిలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ (ములాయం సింగ్ కొడుకు) కూడా వున్నాడు. దానిపై స్పందిస్తూ ఒక ఉపన్యాసకుడు "అఖిలేష్ యాదవ్ గుళ్ళకు గోపురాలకు వెళ్ళడు. కానీ ఖఫ్ పంచాయితీలకు వెడతాడు" అన్నారు. గ్రామాలలో కుల పెత్తందారుల ఫత్వాల్లాంటి తీర్పులనిచ్చే దానినే ఖఫ్ పంచాయితీ అంటారు. ఈ ఖఫ్ పంచాయితీ పెద్దలే "ఆడపిల్లలపై అత్యాచారాలు తగ్గాలంటే 16 ఏండ్లకే వివాహం చేసుకునే విధంగా వివాహ చట్టంలో మార్పులు చేయాల"ని ఇటీవల డిమాండ్ చేశారు. దాన్ని బలపరుస్తూ హర్యానాలో మాజీ ముఖ్యమంత్రి (దేవీలాల్ కొడుకు) ఓం ప్రకాశ్ చౌతాలా కూడా ప్రకటించారు. ఎన్నికల పార్టీలన్నీ ఈ (ఖఫ్) కులపెత్తందార్ల ఆదేశాలకు చెవియొగ్గటం మన దేశంలో వాస్తవికంగా అమలవుతున్న అప్రజాస్వామిక తత్త్వానికి నిదర్శనం.

వీళ్ళు కులాంతర వివాహాలను అనుమతించరు సరికదా, వేల ఏండ్ల నాటి ఒకే గోత్రీకులు పెండ్లి చేసుకోరాదనే సూత్రాన్ని కూడా పాటించి తీరాల్సిందేనని ఫత్వాలు జారీ చేస్తుంటారు. వాటిని పాటించడాన్ని నిరాకరించిన వారికి కుల బహిష్కరణ శిక్షలు, గ్రామ బహిష్కరణ శిక్షలు విధిస్తుంటారు. ఒక జంటనైతే చంపేశారు కూడా.

అది హర్యానా రాష్ట్రంలో జరిగింది. మనోజ్, బాబ్లీ అనే యువతీ యువకులు యిష్టపడి పెళ్ళి చేసుకుని ఐదేళ్ళు కాపురం చేసి పిల్లల్ని కన్న తర్వాత వారిద్దరిదీ ఒకే గోత్రమని తెలిసిన 'ఖఫ్' పంచాయితీ పెదరాయుళ్ళు వారిని విడిపోవాల్సిందేనని ఆదేశిస్తే దాన్ని వారు నిరాకరించినందుకు హత్యచేయించబడ్డారు. హర్యానాలోని కర్నాల్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి, పై దంపతులను హత్యచేసినందుకుగాను, అందుకు బాధ్యులైన కులపెద్దలు (ఖఫ్)తో సహా ఐదుగురికి 2007లో ఉరిశిక్షను విధించారు. దానితో ఆ తీర్పుని అమలు చేయరాదనీ, ఆ తీర్పుకు ప్రాతిపదిక అయిన 1955 నాటి హిందూ వివాహ చట్టాన్ని -సగోత్ర వివాహాల్ని నిషేధిస్తూ సవరించాలనీ 'ఖఫ్' పెత్తందార్లు హెచ్చరికలు చేశారు. అలా చేయకుంటే పార్లమెంటు, అసెంబ్లీ సభ్యులను కూడా సామాజికంగా బహిష్కరిస్తామంటూ, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన 300 మంది ఖఫ్ పంచాయితీదార్లు బెదిరింపులు చేశారు. సారాంశంలో ఈ పెత్తందారీశక్తులు తాము రాజ్యాంగచట్టానికి లోబడి వుండమనీ, రాజ్యాంగాన్నే తమ అభీష్టం మేరకు మార్చాలని శాసిస్తున్నారు.

ఈ ఖఫ్ పెత్తందార్ల పంచాయితీలో స్త్రీలు పాల్గొనటానికి వీలులేదు. పురుష పుంగవుల నిర్ణయమేదైనా స్త్రీలతో సహా అందరూ అమలు జరిపి తీరాలి. వీటికి మూల కారణం పెట్రేగుతున్న అగ్రకుల ఫ్యూడల్ దురహంకార పితృస్వామిక శక్తులు. వీళ్లే కులము, వంశము, గోత్రము లాంటి సాకుతో అనేకమంది యువతీ, యువకులను దారుణంగా బలితీసుకుంటున్నారు. వారి వారి కుటుంబసభ్యులే 'పరువు' హత్యలు చేసేట్లు సామాజిక, భావజాలపరమైన ఒత్తిడులను సృష్టిస్తున్నారు.

ఈ తరహా 'కుల' పంచాయితీలకు రైతు నాయకుడుగా గుర్తింపు వున్న తికాయట్, కేంద్రమంత్రి అజిత్‌సింగ్ (మాజీ దేశప్రధాని చరణ్‌సింగ్ కొడుకు) లాంటివారూ, పోలీసు, న్యాయ, పరిపాలనారంగాలలో ఉన్నతాధికారులు (బ్యూరోక్రాట్లు) కూడా హాజరవుతూవుంటారని పత్రికలు రాస్తున్నాయి. రాజకీయ నాయకులకు ఓట్లు సాధనకు ఈ పంచాయితీలు అవసరమై వుంటే, కొత్తతరాల రాజకీయ నాయకులు ఎదగడానికివి పునాదులుగా వుంటున్నాయి. ఇవి ఫ్యూడల్ దురహంకార శక్తుల్ని బలోపేతం చేస్తున్నాయి. దీని ఫలితంగా గ్రామీణ పేదలపై వర్గదోపిడీ తీవ్రతరమవుతోంది. దళితులు-మహిళలపై అణచివేత మరింత క్రూరంగా సాగుతోంది. అందులో భాగంగానే ఈ నెల మొదటి తేదీల్లో హర్యానా రాష్ట్రం దేవ్రాలో 8 మంది పురుష దురహంకారులు 16 ఏళ్ళ దళిత మహిళను కిడ్నాప్ చేసి సామూహిక మానభంగం గావించి, ఆ సంఘటనలను సెల్‌ఫోన్లో చిత్రీకరించి, బయటపెడితే కుటుంబాన్నే హతమారుస్తామంటూ బెదిరించారు. మొబైల్ ఫోనులోని చిత్రీకరణలను చూసిన ఆ అమ్మాయి తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. దానితో 10 రోజులకు అసలు విషయం బయటకు పొక్కింది. దళిత విద్యార్థి నాయకుడు ప్రదీప్ అంబేద్కర్ "ఇక్కడ దళిత మహిళలు బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోంది. ఈ సంఘటన అందరినీ భయోత్పాతానికి గురిచేసింది. తల్లిదండ్రులు తమ ఆడపిల్లల్ని చదువులకోసం బడికి, యితర పనులకోసం బజారుకీ పంపడానికి భయపడుతున్నారు" అన్నాడు. (ది హిందూ 12-10-2012)

దేశవ్యాపితంగా మహిళలపై పెరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలు, దాడులు వారికి భయంకరమైన అభద్రతను కలిగిస్తున్నాయి. ఫలితంగా గడపదాటకుండా, పరదా చాటునే బతకమనే సామాజిక ఒత్తిడి వారిని మధ్యయుగాల అంధకార సంస్కృతివైపు నెడుతోంది. 2007-08 గుణంకాల ప్రకారం ఇప్పటికే దేశ వ్యాపితంగా ప్రతి 1000 వివాహాల్లో 434 బాల్య వివాహాలే జరుగుతున్నాయి. ప్రతివెయ్యి మందికీ బీహారులో-682; రాజస్థాన్‌లో-576; జార్ఖండ్‌లో-557; మధ్యప్రదేశ్‌లో-538; ఉత్తరప్రదేశ్‌లో-549; ఆంధ్రప్రదేశ్‌లో 519; కర్నాటకలో-502 బాల్యవివాహాలు జరుగుతున్నాయి.ఖఫే పెత్తందార్లు మొగలాయీల కాలంనాటి బాల్య వివాహాల అవసరాన్ని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. తమ ఖఫ్ పంచాయితీకి 1500 సంవత్సరాల చరిత్ర వుందని సగర్వంగా మీసాలు మెలేస్తున్నారు. నేటి రాజ్యాంగం స్త్రీలకు కల్పించిన కనీస హక్కులను చట్టబద్ధ విధి నిషేధాలనుండి తప్పించుకోవడానికి గాను ఈ కేసును ఎలాగోలా మసిపూసి మారేడుకాయ చెయ్యటానికి ఖఫ్ పంచాయితీదార్లు తలమున్కలైవున్నారు. "ఆడ, మగ పిల్లలకు 16 ఏళ్ళ వయసుకు

పెళ్ళిళ్ళు చేస్తే యిలాంటి సంఘటనలు జరగవని" ప్రకటించటమే కాక, 1955 నాటి హిందూ వివాహ చట్టంలోని వివాహ వయోపరిమితిని తగ్గించాలని డిమాండు చేసే దాకా వెళ్ళారు. దీన్ని బలపరుస్తూ ఓం ప్రకాశ్ చౌతాలా ప్రకటించాడు, ఆడపిల్లల దుస్తులు వాడకం మగవారిని రెచ్చగొట్టేట్లుంటున్నాయని కొందరూ, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనార్జీ అయితే-ఆడ, మగ పిల్లలు పూసుకు, రాసుకు తిరుగుతున్నందుకే ఆడపిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నాయనే దాకా వెళ్ళారు. ఒక కేంద్రమంత్రి "అత్యాచారాల కేసులో 90% నిజాలుకావనీ, ఇరువురి ఇష్టంతోనే జరుగుతున్నాయనీ" అన్నాడు.

నూతనతరాలలో మత్తుపానీయాల సేవనాన్ని ఎవరు ప్రోత్సహిస్తున్నారు? సెక్స్-హింసలమయమైన బూతు చిత్రాలనూ, సినిమాలనూ, టీవీలు, అంతర్జాలాల ద్వారా ఎవరు వ్యాప్తి చేస్తున్నారు? వ్యక్తిత్వాలను కాక స్త్రీల అందమంతా శరీరపు మాంసపు ముద్దలలోనే ఉన్నదనే ఆకర్షణలను సృష్టించి, అలా ఆకర్షించటమే స్త్రీత్వమనే క్షీణ సాంస్కృతిక విలువలను అందాల పోటీల చాటున ఏ మార్కెట్టు విలువలు శాసిస్తున్నాయి? ఏకపక్ష ప్రేమను ఆమోదించితీరాలనే మగదురహంకారాల ప్రేరకులెవరు?

పుట్టిన దగ్గరనుండి చనిపోయేదాకా స్త్రీల ఆలోచనలను, అభిరుచులను, ప్రవర్తనలను అదుపు చేసే ఫ్యూడల్ పితృస్వామిక సంస్కృతి పునాదులపై, సామ్రాజ్యవాద వ్యాపార మార్కెట్టు శక్తులు దాడిచేస్తూ స్త్రీల వ్యక్తిత్వాలను హరించే, పక్కదారి పట్టించే సంస్కృతిని వెర్రి తలలు వేసే స్థాయికి పెంచి పోషిస్తున్నారు. కాలం చెల్లిన భూస్వామ్య సంస్కృతి నుండి బయటపడాలని మహిళలు సాగించే ప్రతి ప్రయత్నాన్నీ పక్కదారి పట్టించటానికి సామ్రాజ్యవాద సంస్కృతి సమస్త విపరీత ఆకర్షణలతో సంసిద్ధంగా వుంటోంది. పరోక్షంగా స్త్రీ జాతినే హతం గావించే ధోరణులను క్షీణవిలువల ధనస్వామ్య సంస్కృతిని శిశుహత్యల రూపంలో ప్రకోపింపజేస్తోంది. ఖాఫ్ కులపంచాయితీలు ప్రబలంగా వున్న రాష్ట్రాలలో స్త్రీల జనాభా పురుషుల జనాభాకంటె ఘోరంగా తరిగిపోతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు హర్యానాలో -877;పంజాబులో-893; ఉత్తరప్రదేశ్‌లో-908; బీహారులో-916; గుజరాత్‌లో-918; మహారాష్ట్రలో-925; రాజస్తాన్‌లో-926; మధ్యప్రదేశ్‌లో - 930 మంది స్త్రీలు మాత్రమే వున్నారు. (కేరళ-1084; తమిళనాడు-995; ఆంధ్రప్రదేశ్-992 కాగా దేశపు సరాసరి 940గావుంది)

భూస్వామ్య-సామ్రాజ్యవాద సంస్కృతుల నుండి మనదేశం నేటికీ బయట పడకపోయినా 65 ఏళ్ళ క్రితం లభించినదని చెప్పకునే ఘనాతి ఘన స్వాతంత్ర్యానంతరం యిప్పటికి 5 కోట్లమంది ఆడపిండాలను ఈ 'పుణ్య' భూమిమీద పడక ముందే తల్లి గర్భంలోనే చిదిపివేశారు. తమ జీవన వ్యక్తిత్వాలతో, ఆత్మ విశ్వాసంతో బతికి బట్టకట్టాలనుకునే మహిళకు అడుగడుగునా కాదు అంగుళమంగుళం అడ్డంకులూ, ఆటంకాలు కల్పించే ఈ వ్యవస్థలో "ఆడదై పుట్టటం కంటె అడవిలో మానై పుట్టటం మేలు" అనే పాతకాలపు సామెత నేటికీ వాస్తవమై వుండటం ఎంత శోచనీయమైన పచ్చి నిజం?

ఎందరో సంఘ సంస్కర్తలూ, స్వాతంత్రోద్యమకారులూ, విప్లవ వీరులూ, ప్రగతిశీల రచయితలూ - నూతన సమాజ సంస్కృతులకై తమ శక్తియుక్తులను వెచ్చించినా దళారీ-భూస్వామ్య పాలకులు వాటిని వమ్ముగావించి మరింత నీచ రూపాలలో క్షీణ విలువలు ప్రతిష్టిస్తున్నారు. యథాతథ స్థితిని సంరక్షించుకోవటానికి, పోటీలు పడి దేశాన్ని సాంస్కృతికంగా వెనక్కి నడిపిస్తున్నారు. దీన్ని తుదముట్టించటానికి ఇందుకు మూలకారణమైన దోపిడీ వ్యవస్థకూ, దాని దుష్టసంతానమైన అగ్రకుల, పితృస్వామ్య సంస్కృతులకూ వ్యతిరేకంగా సాగే ప్రజాస్వామిక ఉద్యమాలకు స్ఫూర్తినందించే సాహిత్య సాంస్కృతికోద్యమ కృషిని రెట్టించిన ఉత్సాహంతో సాగించాల్సి వుంది.

**26-10-2012**

## సంపాదకీయం - 2

# జీవవైవిధ్య వికాసానికి-ఆర్థిక, రాజకీయ వైరుధ్యాల పరిష్కారం అనివార్యం

**కొన్ని దేశాలు ఇతర దేశాలను కొల్లగొట్టే పద్ధతికి స్వస్తి పలకాలి. పర్యావరణాన్ని వినాశనం చేసే సంపన్నదేశాల సంస్కృతినీ, జీవన విధానాన్నీ, కన్స్యూమరిజాలను మూడో ప్రపంచ దేశాల నెత్తిమీద రుద్దకుండా చూడాలి!"**

**(ఫిడెల్ కాస్ట్రో 1992 రియో డి జనీరోలో ఎర్త్ సమ్మిట్ సందర్భంగా)**

నేలనీ, నేలమీద వృక్షజాతుల్నీ, జంతురాశుల్నీ చుట్టూవున్న మట్టిపొరల్లో నిక్షిప్తమైవున్న అనంతమైన సహజవనరుల్ని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కాకుండా 'అదనపు విలువల' ఊబిలోకి నెడుతున్న 'ప్రపంచ పెద్దమనుషులూ' వాళ్ళ 'తాబేదార్లు' జీవవైవిధ్య సదస్సును హైదరాబాదులో ఇటీవల నిర్వహించారు. వినాశకులే రక్షకులుగా డాబులు కొడుతున్నారు. తమ మొత్తం నేరాన్ని సాధారణీకరించి-'మనిషి' మీదకి దానిని నెడుతున్నారు.

ప్రకృతి వైవిధ్యాన్నీ, జీవవైవిధ్యాన్నీ, మానవ వైవిధ్యాన్నీ మొత్తంగా సంక్షోభంలోకి నెడుతున్న కొడంకుళం అణువిద్యుత్ కేంద్రం గురించి పల్లెత్తుమాట అనకుండా జీవవైవిధ్య సదస్సును పూర్తి చేసిన ఘనుల చిత్తశుద్ధిలోని డొల్లతనాన్ని ఎవరు ప్రశ్నించాలి?

1989లో చెర్నోబిల్ అణువిద్యుత్ కేంద్ర విస్ఫోటనమూ, జపాన్ దేశపు ఫుకుషిమా అనుభవాలను గుణపాఠాలుగా తీసుకోకుండా రాబోయే కాలంలో 2017 కల్లా భారత ప్రభుత్వం సుమారు 16,100 మెగావాట్ల అణువిద్యుత్ కేంద్రాలను ఏ జీవవైవిధ్య పరిరక్షణ కోసం నిర్మిస్తున్నారో దేశ శాస్త్రవేత్తలుగా, మేధావులుగా చెలామణి అయిపోతున్న మహానుభావులు ఎందుకు నోరు విప్పిఅడగరని నిలదీయాల్సిన రోజు వచ్చింది.

ఇప్పటివరకు జరిగిన పరిశోధనల ప్రకారం 4,80,000 జాతుల ప్రపంచ వృక్ష సంపదలో 48,000 జాతులు ఒక్క భారత దేశంలోనే ఉన్నాయని తెలుస్తోంది.

వ్యవసాయం 10,000 సం॥ల క్రితం ప్రారంభమైందనుకుంటే 1966 నాటి హరిత విప్లవం రానంతవరకు భారతదేశం రైతాంగం 30,000 రకాల వరి వంగడాలను పండించేవారు. సామ్రాజ్యవాద హరిత విప్లవం పుణ్యమా అని ఇప్పడు రైతులు 10 రకాల వరి వంగడాలను మాత్రమే పండిస్తున్నారు. 75% వరి దిగుబడి కేవలం పదిరకాల వంగడాల వల్లనే వస్తోంది. పాకిస్తాన్‌లో అయితే 95% వరి దిగుబడి కేవలం 4 రకాల వంగడాల నుంచే రావడం చూస్తుంటే సామ్రాజ్యవాదం, దాని తొత్తులైన ఉపఖండ పాలకవర్గాలు పంటల వైవిధ్యాన్ని తద్వారా జీవవైవిధ్యాన్ని ధ్వంసంచేసి ఇవాళ అంతర్జాతీయ జీవవైవిధ్య సదస్సు నిర్వహించడం ఏ నైతికతకు నిదర్శనం?

కేవలం సామ్రాజ్యవాద దేశాల జన్యుమార్పిడి పంటల ఉత్పత్తిని మనలాంటి దేశాల్లో ప్రవేశపెట్టడానికే ఈ 'జీవవైవిధ్య' బూటకమంతా అన్నదే తెలుతున్న నిజం.

ఆహార భద్రతకు, సేంద్రియ వ్యవసాయానికి జీవవైవిధ్యం ఆధారం. ప్రజలకు భద్రత లేకుంటే జీవవైవిధ్యం ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెబుతున్నారు.

హరిత విప్లవం వచ్చాక-మొక్కల్లోనే కాక, గ్రామీణ పశువుల్లోనూ, పక్షి జాతుల్లోనూ, పురుగు పుట్టల్లోనూ, సూక్ష్మ క్రిముల్లోనూ వైవిధ్యం సర్వనాశనం అయ్యింది. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకంవల్ల నేలంతా కలుషితమైంది. రైతుకి మేలు చేసే జీవరాశి నాశనమైంది.

హైదరాబాదులో19 రోజులపాటు జరిగిన జీవవైవిధ్య సదస్సులో 184 దేశాలూ, 14,600 మంది ప్రతినిధులు పాల్గొన్నారని పత్రికలు చెబుతున్నాయి. అయితే వారు సాధించినదే పరమార్థం? అని తరచి చూస్తే-అభివృద్ధి చెందుతున్న దేశాలకు అభివృద్ధి చెందిన దేశాల ఎంగిలి చేతులు విదిలించిన రెట్టింపు మెతుకులు (నిధులు) మాత్రమే.

తీరాచూస్తే, ఈ అంతర్జాతీయ సదస్సుల తీర్మానాలు ఎప్పటికీ అమలులోకి రావు, ఎందుకంటే అమెరికావంటి సామ్రాజ్యవాద దేశాలు వీటికి అనుకూలంగా లేవు సరికదా తలవొగ్గవు కూడా!

చేతులు నరికి-నోటికి తినిపించేస్తున్నట్లు నమ్మించే అమెరికా సామ్రాజ్యవాదం హిరోషిమా, నాగసాకిలపై ఆటంబాంబుల ప్రయోగంతో ఎంత జీవ విధ్వంసానికి కారణమైందో చరిత్ర చెబుతోంది. దానికి పూర్వం రెడ్ ఇండియన్ల ఊచకోతతో అక్కడ చెట్టూచేమా, పిట్టాగుట్టల్నీ, నదుల్నీ, వాగుల్నీ, నేలనీ సర్వనాశనం చేసిన ఆనవాలు మన స్మృతి పథం నుంచి చెరిగిపోలేదు. 1962-75లలో వియత్నాంలో 'ఏజెంట్ ఆరెంజ్' ప్రయోగంతో విష రసాయనాల విస్ఫోటనానికి ఈ నాటికీ అక్కడి మనుషులు ఎలా జన్యు వైకల్యాలకు గురవుతున్నారో కళ్ళఎదుటే వున్న సాక్ష్యాలు చాలు నేటి ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల సంగతి భోపాల్ విషవాయు బాధితుల దురవస్థలూ చెప్పపనిలేదు.

ఒకచేత్తో అదుపులేని విధ్వంసకర పారిశ్రామిక కాలుష్య విధానంతో ప్రపంచ జీవ వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నారు. ఇంకా అవి కోస్తా కారిడార్‌లు కావచ్చు, వాన్‌పిక్‌లు కావచ్చు, సెజ్జులు, గనుల తవ్వకం కావచ్చు, అడవుల నరికివేత, థర్మల్ అణువిద్యుత్ కేంద్రాల కొలిములు కావచ్చు, కానీ జరిగేదిమాత్రం వాడి దోపిడీకై మన వనరుల, జీవజాల విధ్వంసమే.

మరోవైపు ఒకే మార్కెట్టు ఒకే సంస్కృతి అనే విధానంలో భాగంగా ఇంగ్లీషే ఏకైక భాషగా నమ్మించి, ప్రపంచ భాషా వైవిధ్యాన్ని సామ్రాజ్యవాదం ధ్వంసం చేస్తోంది. వికాసవంతం కావల్సిన మిత్రపూరిత జండర్ వైవిధ్యాన్ని శత్రువైరుధ్యం వైపుకి నెడుతోంది. సానుకూలం చేసుకోదగిన ప్రాంతీయ భాషా, ఉచ్చారణ మాండలికాల్లోని సంపద్వంతమైన వైవిధ్యాన్ని కూడా శత్రుపూరిత సంఘర్షణ అంచులకు తీసుకెళ్తోంది.

వైవిధ్యాన్ని వికసింప చేసుకోవలసిన ప్రకృతి గతితర్కాన్ని భ్రష్టు పట్టించి, శత్రువైరుధ్యంలో వున్న సామాజిక చలనానికి యిరుసైన వర్గ సంఘర్షణను సంఘటితం పడకుండా విచ్ఛిన్నాన్ని వ్యాప్తి చేస్తున్న సామ్రాజ్యవాదం ఇవాళ జీవ వైవిధ్య సదస్సుని సొంత ప్రయోజనాలకోసం మళ్ళించుకోవాలని చూస్తూనే, ప్రపంచ రక్షణకు బాధ్యత వహిస్తున్నట్టు డాబులు కొడుతుంది.

సోంపేట, కాకరాపల్లి ప్రజాఉద్యమాలను అణచివేయటం, కొవ్వాడ మత్స్యకారులను అణుకొలిమిలో వేయించడం మౌనంగా కొనసాగిస్తారు. అదే సమయంలో విధ్వంసం బాధ్యతను మానవ ప్రవృత్తిపైకి నెట్టివేస్తారు. మానవజాతి సాధించిన వైజ్ఞానిక ప్రగతిపై గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్న సామ్రాజ్యవాద శక్తులే పర్యావరణ విధ్వంసానికి అసలుసిసలు కారకులు.

జన్యుచౌర్యానికి కూడా పాల్పడుతున్న బహుళజాతి కంపెనీలకు మన దేశంలోని కొందరు శాస్త్రవేత్తలు ఇంటిదొంగల చందంగా తోడ్పడుతున్నారు. ఆహార భద్రతకి, సేంద్రీయ వ్యవసాయానికీ జీవవైవిధ్యం ఎందుకు పునాది అవుతుందో చర్చ జరగాల్సిన కూడలిలో మనం నిలబడివున్నాం. మార్క్స్ చెప్పినట్లు-"గ్రామాలు పట్టణాల మధ్య అగాధాన్ని తొలగించకుండా మట్టిలో పోషకాలను పునరుద్ధరించి సుస్థిరత సాధించడం సాధ్యంకాదు"

క్యూబన్ విప్లవకారుడు, కవి, రచయిత, న్యాయవాది, జోస్ మార్టి యిలా అన్నాడు-

"ప్రపంచం యొక్క కీర్తి అంతా ఒక ధాన్యపు గింజలో ఇమిడిపోతుంది"

అందుకు భావజాలరంగంలో సాహిత్య సాంస్కృతిక ఉద్యమం సామాజిక సంఘర్షణకు పదును పెడుతూనే వుంటుంది.

ఈ అంతర్జాతీయ సదస్సులనే సిగ్గుమాలిన విన్యాసాల్నీ జీవవైవిధ్య వినాశనకారుల్నీ సంఘటిత నూతన ప్రజాతంత్ర శక్తుల కార్యాచరణే అదుపు చేయగలదు.

27-10-12

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1269**

* * *

**Read other issues of Praja Sahiti Magazine@**

**http://kinige.com/kbrowse.php?via=author&id=58**